క్లుప్తంగా

మూఢనమ్మకాలను పారదోలాలి

గిద్దలూరు రూరల్: మూఢ నమ్మకాలను పారదోలాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక 18 వ మహాసభల సందర్భంగా శనివారం పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ రోడ్డు నుంచి క్లబ్‌రోడ్డు, రాచర్లగేటు సెంటర్, చిన్నమార్కెట్ సెంటర్‌లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎస్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ అంటే రసాయనాలు, పరిశోధనలే కాదు సువిశాలమైన సమాజంలోని సమస్యలను వెలికి తీసేందుకు పనిచేయాలన్నారు. సైన్స్ తగ్గిపోయే కొద్దీ అనేక రకాల చాదస్తాలు, భావాలు పెరిగి సమాజానికి హాని కలిగిస్తాయన్నారు. వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్య పరిచేందుకు జనవిజ్ఞాన వేదిక ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యం నీటి వృథా



వృథాగా పోతున్న మంచినీరు

బేస్తవారిపేట: మండలంలోని బసినేపల్లెలో నిత్యం సింగల్‌ఫేజ్ మోటార్ నీరు వృథాగా పోతోంది. కోనపల్లె రోడ్డు పక్కన పశువుల నీటితొట్టిలోకి చుట్టుపక్కల గ్రామస్తులు మంచి నీరు అవసరమైనప్పుడు స్టార్టర్ ఆన్ చేస్తారు. నీటిని పట్టుకున్న తర్వాత మోటార్‌ను ఆపకపోవడంతో గంటల తరబడి నీరు వృథాగా పక్కనే ఉన్న వాగులోకి పోతోంది. పంచాయతీకి విద్యుత్ మోటార్ బిల్లు అధికంగా రావడమే కాకుండా, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది.

ఈసీ, బీజేపీలపై చర్యలు తీసుకోవాలి

మార్కాపురం: బీజేపీ, ఎలక్షన్ కమిషన్ కుమ్మక్కై దొంగ ఓట్లతో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి 2024లో అధికారం చేపట్టి దేశద్రోహానికి పాల్పడ్డాయని ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు సయ్యద్ జావీద్ అన్వర్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన సమావేశంలో సాక్ష్యాధారాలతో నిరూపించారని చెప్పారు. దొంగ ఓట్ల కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న సంగమేశ్వరరావు

మార్కాపురం టౌన్: అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు రోడ్డులోని లింగారెడ్డి కాలనీలో వృద్ధులకు అన్నదానం హైకోర్టు న్యాయవాది, కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు, అభయ ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల లెక్చరర్లు కుమార్, అనీల్ పాల్గొన్నారు.

ముఖద్వారం ప్రారంభం

పుల్లలచెరువు: పుల్లలచెరువులో ముఖద్వారాన్ని శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన చింతచెర్వు రత్తయ్య, రాములమ్మ దంపతుల కుమారులు శ్రీను, రామారావు, లక్ష్మణరావులు సుమారు రూ.15 లక్షలతో ముఖద్వారాన్ని నిర్మించారు. ఆలయ పూజారి గోవర్ధానాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బీటలువారిన బ్రిటన్ రోడ్డు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని బ్రిటన్ రోడ్డు బీటలువారి ప్రజల రాకపోకలు ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల హైవే నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ఉండే బ్రిటన్ రోడ్డు మధ్యలో పెద్ద చీలిక ఏర్పడి ద్విచక్ర వాహనాల చక్రాలు అందులో చిక్కుకుని కిందపడేలా ప్రమాదకరంగా ఉంది. పోరుమామిళ్లకు వెళ్లేందుకు ప్రధానంగా పెద్ద పెద్ద వాహనాలు బ్రిటన్ రోడ్డు మీదుగానే వెళుతుంటాయి. బ్రిటన్‌రోడ్డులోని ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద సీసీ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. బ్రిటన్ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలతో పాటు రోడ్డు మధ్యలో చీలికలను పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు. అలా చేయని పక్షంలో రోడ్డు పై ప్రమాద సూచిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న చీలిక



ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద పెద్ద పెద్ద గుంతలతో ఛిద్రమైన రోడ్డు

న్యాయవాదులకు క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి శుభవాణి, పక్కన న్యాయవాదులు

మార్కాపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో న్యాయవాదుల క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక, ఉల్లాసానికి తోడ్పడతాయని తెలిపారు. పోటీల్లో న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొని క్రికెట్ ఆడారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్ క్రికెట్ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడి అందరినీ మెప్పించారు. కార్యక్రమంలో అదనపు మొదటి తరగతి న్యాయమూర్తి ఎం.బాలాజీ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ అలీ జహీర్, వి.నాగేంద్రకుమార్, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, జూనియర్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



సోదరితో రాఖీ కట్టించుకుంటున్న అన్నా రాంబాబు



వెలుగొండలో భక్తుల పూజలు

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమకు ప్రతిరూపంగా ఏటా శ్రావణ పౌర్ణమి రోజు రాఖీ పండుగను ఘనంగా జరుపుకుంటారు. పట్టణంలోని పలు గృహాల్లో రాఖీ పండగ సందడి కనిపించింది. ఆయా షాపుల్లో వివిధ రకాల రాఖీలను వ్యాపారులు అమ్మారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు పలువురు రాఖీలు కట్టారు. ఆయన సోదరి సరోజ రక్షాబంధన్ సందర్భంగా తన అన్న రాంబాబుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

కొనకనమిట్ల: శ్రావణ పౌర్ణమి, రాఖీ సందర్భంగా శనివారం పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, ఎదురాళ్లపాడు, పెదారికట్ల శివాలయాల్లో స్వామి వార్లకు అర్చనలు, అభిషేకాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు నిర్వహించారు. పలువురు భక్తులు నైవేద్యాలు సమర్పించి స్వామి వార్లకు మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు సింహాద్రీచార్యులు, విజయకాంత్‌శర్మలు స్వామివార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాఖీ సందర్భంగా అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్లు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపి అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టారు.

చెన్నకేశవునికి శాంతి కల్యాణం



ఉభయ దేవేరులతో స్వామివారు



కల్యాణోత్సవంలో ఉభయదాతలు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామివారి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్య రంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామి వారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించిన అనంతరం ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ ఘట్టం నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం

పట్టణంలోని కంభం రోడ్డులో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణం అర్చకులు నిర్వహించారు. ఉభయదాతలు పాల్గొని స్వామివారి కల్యాణం నిర్వహించారు. అర్చకులు అరుణ్‌కుమార్ బృందం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని మండపంలో ప్రతిష్ఠించి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కోలాహలంగా పట్టాభిరామస్వామి ఆలయ ప్రతిష్ట



గ్రామోత్సవంలో ఉత్సవ మూర్తులు



గణపతి పూజలో పాల్గొన్న కంకణధారులు

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసీతా లక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నాలుగు రోజులుగా కోలాహలంగా సాగుతున్నాయి. శనివారం వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ పర్యవేక్షణలో కంకణధారులు అత్యంత భక్తిశ్రద్ధలతో హోమాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాలతో ఉత్సవ విగ్రహాలకు గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పట్టాభిరామస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఆదివారం పట్టాభిరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, నూతన ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ఠ, అనంతరం సీతారాముల శాంతి కల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వనభోజనాలు



కలిసి వంట చేసుకుంటున్న భక్తులు

కురిచేడు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండలంలోని వెంగాయపాలెంలో మహిళలు శనివారం వనభోజనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉదయాన్నే గ్రామ శివారులోని ఉసిరిక చెట్టు వద్దకు వెళ్లి ముందుగా వనదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంట చేసుకుని సహపంక్తి భోజనం చేశారు.



వన దేవతకు పూజ చేస్తున్న మహిళలు

రేపు జార్జి ఫార్మసీలో వర్క్‌షాప్



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

మార్కాపురం: పట్టణంలోని జార్జి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 11వ తేదీన జాతీయ స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. వర్క్‌షాపు ద్వారా విద్యార్థులు ఫార్మాసూటికల్, ఇతర సైన్సు ఫీల్డ్స్‌లో విస్కోసిటీ రియాలజీ కొలతల ప్రాముఖ్యతను నేర్చుకునే అవకాశం పొందుతారన్నారు. పరిశ్రమల్లో ఉపయోగించే బ్రూక్ ఫీల్డ్స్ విస్కో మీటర్‌పై ప్రత్యేక శిక్షణ పొందటం ద్వారా వారి ప్రాక్టికల్ నైపుణ్యాలు, పరిశోధనా సామర్థ్యం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాపు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కో కన్వీనర్లు ఎస్‌డీ ముజీబ్ రెహమాన్, శ్రీనిధి, అకడమిక్ డీన్ డాక్టర్ వై.సునీత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ కె. అశోక్ బాబు, కాలేజీ ఏఓ కె.కృపాల్ పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొంద్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవాలయం అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. సంతానం కలగాలని స్వామి వారికి మొక్కులు చెల్లించి గిరికొండ చుట్టూ దంపతులు ప్రదక్షిణలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



త్రిపురాంతకేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



బాలాత్రిపురాంతకేశ్వరస్వామికి నవ ధాన్యార్చన

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా లక్ష బిల్వార్చన, నవ ధాన్యార్చన ప్రత్యేక పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. త్రిపురాంతకం ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ పౌర్ణమికి ప్రత్యేకంగా స్వామి వారికి జరిగిన బిల్వార్చన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద నవ ధాన్యర్చన చేశారు. ప్రత్యేక పూజల్లో దంపతులు పాల్గొన్నారు. ప్రతి నెలా పౌర్ణమికి జరుగుతున్న గిరి ప్రదక్షిణలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాదం భక్తులకు అందజేశారు.

ఎనీటైం మూతా!

- పనిచేయని ఏటీఎం సెంటర్లు
- పట్టించుకోని అధికారులు
- యాచకులకు నిలయాలుగా మారుతున్న ఏటీఎం సెంటర్లు

కంభం: పేరుకు పదికి పైగా ఏటీఎం సెంటర్లు ఉన్నా వాటిలో కొన్ని సక్రమంగా పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కందులాపురం సెంటర్‌లో ఉన్న ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ ఏటీఎంలు నెలల తరబడి పనిచేయకపోవడంతో అక్కడికి వచ్చే ప్రజలు అసహనానికి గురవుతున్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డులు సైతం లేకపోవడంతో అవి యాచకులకు నిలయాలుగా మారిపోతున్నాయి. ఏపీజీబీ, కెనరా బ్యాంకు ఖాతాదారులు నూతనంగా ఏటీఎంలు తీసుకుంటే వాటిని యాక్టివేట్ చేసుకోవడం కోసం కెనరాబ్యాంక్ ఏటీఎం పనిచేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. రిలయన్స్‌మార్ట్ పక్కన ఉన్న ఓ ఏటీఎం మిషన్ కరెంటు పోతే పనిచేయడం లేదని ట్రాన్సాక్షన్ జరుగుతున్న సమయంలో కరెంటు పోతే నగదు మిషన్‌లోనే ఉండి పోతున్నాయని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. ఇంకా కొన్ని కేంద్రాల్లో నగదు సరిగ్గా అందుబాటులో ఉండటం లేదు. బ్యాంక్ అధికారులు స్పందించి ఏటీఎం కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కందులాపురం సెంటర్ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఉన్న యాచకుల లగేజీ



పనిచెయ్యని కెనరా బ్యాంక్ ఏటీఎం వద్ద కూర్చొని ఉన్న యాచకుడు

కొప్పకొండ దిగొచ్చిన వెంకన్న



స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారులు

యర్రగొండపాలెం: స్థానిక కొప్పుకొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి భక్తులకు అందుబాటులో ఉండేందుకు ఆ కొండ దిగొచ్చారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం పక్కన నిర్మించిన నూతన ఆలయ ప్రవేశం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు ఆలయ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, వాస్తు హోమం, స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా 108 మంది దంపతులతో శ్రీనివాస కల్యాణం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద కార్యక్రమాలను భక్తులు చేపట్టారు. అనంతరం స్వామి గ్రామోత్సం చేసి భక్తులకు ప్రత్యేక దర్శనం ఇచ్చారు. పూజలో పాల్గొన్న దంపతులకు తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆ నూతన ఆలయం పక్కన వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు.